క్లుప్తంగా

నేడు ఆలయాల్లో ఉగాది వేడుకలు

పెందుర్తి: శ్రీ విశ్వవసు నామ తెలుగు సంవత్సరాది పర్వదినం సందర్భంగా స్థానిక వెంకటాద్రిపై ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. తెలుగు సంవత్సరాది సందర్భంగా స్వామివారు చందనాలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. వెంకటాద్రి ఘాట్ రోడ్డు వద్ద మహాకామేశ్వరి ఆలయంలో ఉగాది వేడుకలు జరుగుతాయని ఆలయ ప్రతినిధి డి.వై చైనులు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం జరుగుతుందని చెప్పారు.

శారదాపీఠంలో..

చినముషిడివాడలోని శారదాపీఠంలో ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు పీఠం ప్రతినిధులు తెలిపారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ సారథ్యంలో ఉదయం పంచాంగ శ్రవణంతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. అనంతరం స్వామీజీ చేతుల మీదుగా భక్తులకు ఉగాది పచ్చడి వితరణ చేస్తారన్నారు. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా ఉగాది విశిష్టతపై ప్రవచనం ఉంటుందని చెప్పారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

నేడు అప్పన్న పెళ్లిరాట మహోత్సవం

సింహాచలం : ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం సింహాచలంపై శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి పెళ్లిరాట ఉత్సవం జరగనుంది. ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ వైదికులు, అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. అలాగే ఉగాది పూజలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామివారికి విశేష అర్చన, ఉగాది పచ్చడి నివేదన చేస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ ఆస్థాన మండపంలో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. అనంతరం 4.30 గంటల నుంచి స్వామివారి పెళ్లిరాట ఉత్సవాన్ని నిర్వహిస్తారు. వచ్చే నెల 8న చైత్ర శుద్ధ ఏకాదశి రోజు జరిగే స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలంపై మూడు చోట్ల పెళ్లిరాటలు వేస్తారు. ఆలయ ప్రాంగణంలోని ఉత్తర ద్వారం ఎదురుగాను, రాజగోపురం వద్ద, వార్షిక కల్యాణోత్సవం జరిగే ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో పెళ్లిరాటలు వేస్తారు. అనంతరం పండితులకు సత్కారాలు, దాతలకు విశిష్ట సేవా పురస్కారాలు అందజేస్తారు. అనంతరం స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. అలాగే సాయంత్రం 4.30 గంటల సమయంలో స్వామివారి మూల విరాట్‌పై సూర్యకిరణాలు పడే అవకాశం ఉంది. ఏటా ఉగాది రోజు సాయంత్రం స్వామివారి మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకడం పరిపాటి. భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాల్సిందిగా దేవస్థానం ఈవో కె.సుబ్బారావు పిలుపునిచ్చారు.

ఉచిత శిక్షణ

సబ్బవరం: సబ్బవరం: మండలంలోని దేవీపురంలోని డాన్ బాస్కో సొసైటీ సంస్థ ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ జె. రాజ్‌పాల్ శనివారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తి గలవారు 7330821028 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

విద్యుత్ షాక్‌తో గోవు మృతి


విద్యుత్ వైరు తగిలి మృతి చెందిన ఆవు

పరవాడ: మండలంలోని వెన్నల పాలెం గ్రామానికి చెందిన వెన్నల కొత్తయ్యకు చెందిన గోవు శనివారం విద్యుత్ షాక్ కారణంగా మృతి చెందింది. స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం సమీపంలోని కళ్లంలో కట్టిన ఆవుపై విద్యుత్ వైరు తెగిపడటంతో ఈ ప్రమాదం జరిగింది.

ప్రమాదంలో ఆవు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిందని కొత్తయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ. 50 వేల నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన ఆవుకు విద్యుత్ శాఖ అధికారులు నష్ట పరిహారం చెల్లించాలని కోరాడు.


నక్కవానిపాలెంలోని ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు, నిర్మాణానికి డంప్ చేసిన మెటీరియల్



అక్రమ నిర్మాణాల వద్ద రెవన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన హెచ్చరికల బోర్డు

కూటమి అండదండ
వేసేయ్ పాగా..

- సబ్బవరం మండలంలో యథేచ్ఛగా భూ ఆక్రమణలు
- అధికార పార్టీ నేతలే భూకబ్జాదారులు
- సహకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది
- పేదల స్థలాలే లక్ష్యంగా ఆక్రమణలు

సబ్బవరం: మండలంలో విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉండడంతో అధికారులు కూడా నోరు మెదపడం లేదు. కొందరు అధికారులు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నా వారిపై దాడులకు తెగపడుతున్నారు.

వలంటీర్‌ను టార్గెట్ చేసి..

మండలంలోని బోదువలసకు చెందిన బొజ్జ తలుపులమ్మ గత ప్రభుత్వం హయాంలో వలంటీర్‌గా పనిచేశారు. గ్రామంలో సుమారు 2 సెంట్లలో కొన్నేళ్ల క్రితం రేకుల షెడ్ వేసుకున్నారు. ఇటీవల సర్పంచ్‌తో పాటు కొంత మంది కూటమి నేతలు వారి కుటుంబ సభ్యులతో వివాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. దీంతో టోల్‌ఫ్రీ నంబర్ 112కు ఫోన్ చేసి సమాచారమందించగా పోలీసులు వచ్చి ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు రావాల్సిందిగా ఆదేశించి వెళ్లిపోయారు. అప్పటికే చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను దౌర్జన్యంగా తొలగించారు. సాయంత్రం పోలీసు స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పగా కనీసం స్పందించలేదు. కేసూ నమోదు చేయలేదు. దీంతో అనకాపల్లి జిల్లా ఎస్పీకి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, వలంటీర్‌పై సర్పంచ్‌తోపాటు కూటమి నేతలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్థలానికి సంబంధించి మా తాతగారి పేరుపై పట్టా ఉందని, పరిశీలించాలని ప్రాథేయపడినా తహసీల్దార్ వినిపించుకోలేదని బాధిత వలంటీర్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారన్నారు. ఆర్‌ఐతో పాటు మిగిలిన రెవెన్యూ సిబ్బంది పోలీసులను వెంటబెట్టుకుని వలంటీర్ నిర్మించుకున్న రేకుల షెడ్‌ను పునాదులతో సహా తొలగించారు. కొద్ది గంటల్లోనే 'మీ సమస్య పరిష్కరించబడింది' అంటూ ఎస్పీ కార్యాలయం నుంచి మెసేజ్ రావడం గమనార్హం.


బోదువలసలో తొలిగించిన వలంటీర్‌కు చెందిన షెడ్ (ఫైల్)

కూటమి నేతలు తలుచుకుంటే..

అనకపల్లి శివారు నక్కవానిపాలెం సమీపంలోని సర్వే నంబర్ 87లో ప్రభుత్వ భూములను కూటమి నేతల అండదండలతో ఆక్రమించి క్రయవిక్రయాలకు చేపడుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. కూటమి నేతలు ప్లాట్లు, షెడ్లు వేసి విక్రయాలు జరుపుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌తో పాటు మిగిలిన రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదులు చేస్తున్నా విలువైన ప్రభుత్వ భూములలో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతున్నాయి.


షెడ్‌ను తొలగిస్తుండటంతో బోరున విలపిస్తున్న వలంటీర్ కుటుంబ సభ్యులు

సబ్బవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 271, 255లలో ఆక్రమణలను, అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ఇటీవల రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. వారిని నిర్మాణదారులు అడ్డుకున్నారు. రెవెన్యూ సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారు. దాడి జరిగిన మరుసటి రోజు తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. రెవెన్యూ సిబ్బంది కూడా ఆక్రమణదారులతో చేతులు కలుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ముడుపులు ఇచ్చేవారి నిర్మాణాలను పాక్షికంగా తొలగిస్తూ వారికి సహకరిస్తున్నారని, ఎదురుతిరిగేవారి నిర్మాణాలను పునాదులతో సహా తొలగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.


సబ్బవరంలో నిర్మాణాలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు (ఈ ఘటనలోనే సిబ్బందిపై దాడి జరిగింది)

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



ప్రభుత్వ భూముల పరిరక్షణ రెవెన్యూ అధికారుల ప్రధాన బాధ్యత. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణలపై కఠినంగా వ్యవహరిస్తాం. సబ్బవరం, అసకపల్లి వంటి ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడుతూ అక్రమణ నిర్మాణాలు చేపడుతున్నట్లు మా దృష్టికి రాడంతో హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేశాం. పలు చోట్ల ఆక్రమణలను తొలగించాం. ప్రభుత్వ భూములు ఆక్రమించిన, అందులో నిర్మాణాలు చేపట్టినా కేసులు నమోదు చేసి, క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

– బి.చిన్నికృష్ణ, సబ్బవరం తహసీల్దార్

భైరవుడికి విశేషంగా పూజలు


భైరవస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: అమావాస్యను పురస్కరించుకుని భైరవవాకలో కొలువు దీరిన భైరవస్వామికి శనివారం విశేషంగా పూజలు జరిగాయి. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజామున 4గంటల నుంచి ఆలయానికి క్యూ కట్టారు. స్వామికి అమృత కలశలు సమర్పించారు. విభూదితో అభిషేకం నిర్వహించారు. దీపారాధన చేశారు.

నూకాలమ్మ ఆలయాలకు పోటెత్తిన భక్తులు


సబ్బవరంలో నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్


అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్


నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న పరవాడ ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు

సబ్బవరం: మండలంలో కొత్త అమావాస్యను పురస్కరించుకుని పలు గ్రామాల్లోని నూకాలమ్మ అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే ఆయా గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సబ్బవరంలో కొలువై ఉన్న శ్రీనూకాలమ్మ అమ్మవారిని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, గ్రామ సర్పంచ్ ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కర్రి బాబుతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ, నాయకులు సబ్బవరపు, నాగేంద్ర, దాడి నూకరాజు, మళ్ల రమణ, సతీష్, నూకరాజు, సరిపరపు వాసు, సబ్బవరపు నాగభూషణం, వార్డు మెంబర్లు గొర్లి శ్రీను, రామకృష్ణ, పల్ల కృష్ణ తదితరులు ఉన్నారు. అదేవిధంగా మండలంలోని గాలిభీమవరం పంచాయతీ పరిధిలోని జాగారపువానిపాలెంలో కొలువై ఉన్న నూకాలమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు అమ్మవారిని కూటమి నేతలు దర్శించుకున్నారు.


గోశాల లేఅవుట్‌లో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారు

ఘనంగా నూకాలమ్మ తల్లి పండగ

పెందుర్తి: కొత్త అమావాస్య పురస్కరించుకుని నియోజకవర్గంలో నూకాలమ్మ తల్లి పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. పెందుర్తిలో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారికి ఉదయం నుంచి భక్తులు విశేష పూజలు జరిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. చింతలగ్రహారంలో నూకాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించారు. పలు నాటికలను ప్రదర్శించారు. వేపగుంటలోని నూకాలమ్మ తల్లి అలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెందుర్తి గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల్లో నూకాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వేలాదిగా భక్తులు ఆయా ప్రాంతాల్లోని అమ్మవారిని దర్శించుకున్నారు.

వాడవాడలా..

సింహాచలం: కొత్త అమావాస్యను పురస్కరించుకుని 98వ వార్డు పరిధి అడవివరంలోని అంబేడ్కర్ నగర్‌లో నూకాంబిక అమ్మవారి పండుగ మహోత్సవం నవ దళిత యువ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పుట్టరూపంలో కొలువుండటం విశేషం. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు కుంకుమలు, చీరలు సమర్పించారు. ఈ సందర్భంగా రాత్రి రేలా రేలా సాంస్కృతిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త గంట్యాడ చిట్టిబాబు, అంబేడ్కర్ నగర్ అధ్యక్షుడు మునపర్తి శివ, నవ దళిత యువ సేవా సంఘం నాయకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. 98వ వార్డు పరిధి సింహాచల్ నగర్‌లో నూకాంబిక అమ్మవారి పండుగ మహోత్సవాన్ని శనివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి సత్తిబాబు, ఆకుల నాగరాజు, సిరిపురపు కృష్ణ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అడవివరంలోని గోశాల లేఅవుట్‌లో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారికి కాలనీ నివాసితులు, భక్తులు శనివారం పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.


అడవివరంలోని అంబేడ్కర్‌నగర్‌లో పుట్టరూపంలో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారు

పరవాడ: కొత్త అమావాస్యను పురస్కరించుకుని పరవాడలో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారి పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు శనివారం అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా పరవాడ ప్రాంత ప్రజలపై ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు. నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న వారిలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ పైల అప్పారావు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, చల్లా కనకారావు, పైల రామచంద్రరావు, పైల పోతినాయుడు, వర్రి లక్ష్మి, గండి ఈశ్వరరావు, వర్రి హరి ఉన్నారు.

ముగిసిన జాతీయ నాటకోత్సవాలు

మద్దిలపాలెం: స్థానిక కళాభారతి ఆడిటోరియంలో మూడు రోజులుగా నిర్వహించిన విశాఖ జాతీయ నాటకోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు మలయాళ నాటకం ద టైగర్ మ్యాన్‌ను ముఖ్య అతిథులు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ మహాకవి గురజాడ రాసిన కన్యాశుల్కం సమాజాన్ని జాగృతం చేసిందన్నారు. కళలు, నాటకాలను ప్రోత్సహించడానికి రైటర్స్ అకాడమీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ విశాఖలో జాతీయ నాటకోత్సవాలు నిర్వహించి, సామాజిక సమస్యలపై స్పందించడం ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మంత్రి కందుల దుర్గేష్, రఘురామ కృష్ణంరాజులు నటనతో మెప్పించి కళల ప్రాధాన్యాన్ని తెలియజేశారన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, ప్రముఖులు నాంచారయ్య, చలసాని కృష్ణప్రసాద్, ఫణిస్వామి, కె.వెంకటేశ్వరరావు, మేడ మస్తాన్‌రెడ్డి, ఆడిటర్ ఏవీ రమణ పాల్గొన్నారు.


టైగర్ మ్యాన్ నాటకంలోని ఓ సన్నివేశం

ఆలోచింపజేసిన 'ద టైగర్ మ్యాన్'

కేరళకు చెందిన మలయాళ దర్శకులు హిస్సం టోంబో దర్శకత్వం వహించిన 'ద టైగర్ మ్యాన్' నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. గిరిజన గ్రామాల్లోని ప్రజల జీవనాన్ని, పేదరికాన్ని కళ్లకు కట్టినట్లు నటీనటులు ప్రదర్శించారు. 32 మంది కళాకారులు చక్కగా నటించి ప్రేక్షకులను కంటతడి పెట్టించారు. లీడర్ జాతీయ నాటకోత్సవాలను పురస్కరించుకుని శనివారం కళాభారతి వేదికపై చిన్నారి రియాన్స్ ప్రహ్లాదుని ఏకపాత్రాభినయం ప్రేక్షకులను ఆకట్టుకుంది.